ప్రజాశక్తి
గురువారం 8 జూన్ 2023 5 అనంతపురం

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ఫ్యాప్టో నాయకులు

# ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

## ఫ్యాప్టో ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలు, విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఫ్యాప్టో నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నాడు ఫ్యాప్టో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అనంతపురం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ ఎస్.సిరాజుద్దీన్, సెక్రటరీ జనరల్ జి.లింగమూర్తి, డిప్యూటీ సెక్రటరీ జనరల్ రమణారెడ్డి, గోవిందరాజులు, నాయకులు సూర్యుడు, కొటేశ్వరప్ప, లింగమయ్య హాజరై మాట్లాడారు. పాఠశాల విద్యా శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఉపాధ్యాయుల పట్ల అనుసరిస్తున్న వైఖరి సరికాదన్నారు. పాఠశాల వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న 117 జీవోను రద్దు చేయాలన్నారు. బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులను మినహాయించాలన్నారు. ఉద్యోగోన్నతులను రెగ్యులర్ ప్రాతిపదికన ఇవ్వాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఓపిఎస్ విధానం అమలు చేయాలన్నారు. పిఆర్‌సి ఇతర బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. చట్టబద్ధమైన 12వ పిఆర్‌సిని వెంటనే నియమించాలని కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలు 11వ పిఆర్‌సికి అనుగుణంగా పెంచాలన్నారు. సమస్యలు పరిష్కారం కాని పక్షంలో ఉద్యమ కార్యాచరణను తీసుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం డిఆర్ఒ గాయత్రిదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు సతీష్, సురేష్, రాజశేఖర్, వెంకటరమణ, సర్దార్ వలి, శంకరమూర్తి, శివ శంకర్, నారాయణస్వామి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఆడిటోరియం.. అవరోధం..!

## స్నాతకోత్సవం నాటికైనా సిద్ధమయ్యేనా..?

## సాంకేతిక విశ్వవిద్యాలయం భవన నిర్మాణం లోపాలమయం

**ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి**

విశ్వ సాంకేతిక విజ్ఞానాన్ని అందించే విశ్వవిద్యాలయంలో చేపట్టిన భవన నిర్మాణం ఆది నుంచి లోపాలమయంగానే సాగుతూ వస్తోంది. అనంతపురం జెఎన్‌టియులో ఆడిటోరియం ఐదేళ్ల తిరగకుండానే పైకప్పు పోయి ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది. ఇప్పుడు దీని మరమ్మతులకు మరో అర కోటి వరకు ఖర్చు కానుంది. విశ్వవిద్యాలయంకు సంబంధించిన పెద్ద కార్యక్రమాలేవైనా నిర్వహించేందుకు వీలుగా అనంతపురం జెఎన్‌టియులో 1100 మంది కూర్చేనా 99 టన్ను ఎసి సామర్థ్యంతో 2004లో రూ.10 కోట్లకుపైగా వ్యయంతో నిర్మాణాలు ప్రారంభించారు. దీని నిర్మాణాలు అనుకున్నంత వేగంగా ముందుకు సాగలేదు. నత్తనడకన నడుస్తూ వచ్చాయి. దీనిపై కాగ్ సైతం తాఖీదులిచ్చింది. అయితే అనేక ఆపసోపాల నడుమ దీని నిర్మాణాన్ని 2018లో పూర్తి చేశారు. దీనికి ఎన్టీఆర్ కళాక్షేత్రమన్న పేరునూ పెట్టారు. ఈ భవనం ప్రారంభమై సరిగ్గా ఐదేళ్లు కూడా గడవకనే ఇది దెబ్బతింది. మరమ్మతలు చేపడితేగాని కార్యక్రమాలు నిర్వహించలేని పరిస్థితులు నెలకొన్నాయి. పైకప్పు దెబ్బతిని, నీళ్లు, దుమ్ము అంతా పడటంతో ఫ్లోరింగ్ కూడా దెబ్బతింది. ఇప్పుడు దీని మరమ్మతులకు రూ.54 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ మేరకు టెండర్లు సైతం ఆహ్వానించారు. అయితే ఇవి పూర్తయి మరమ్మత్తులు చేపట్టేందుకు ఎంత సమయం పడుతుందో చూడాల్సి ఉంది.

**మరమ్మతులు కాకపోతే స్నాతకోత్సవం ఎలా ?**

సాధారణంగా ఆగస్టు మాసంలో అనంతపురం జెఎన్‌టియులో స్నాతకోత్సవం నిర్వహిస్తుంటారు. ఈ కార్యక్రమాన్ని ఆడిటోరియంలోనే నిర్వహిస్తారు. ఎందుకంటే అనంతపురం నగరం పరిధిలో ఇంతటి ఏర్పాట్లతోనున్న మరో ఆడిటోరియం ఎక్కడా లేదు. ఈ ఒక్క చోటే 1100 మంది కూర్చేనే కెపాసిటీతో ఆడిటోరియం ఉంది. అయితే ఇప్పుడు దెబ్బతిన్న ఈ ఆడిటోరియం టెండర్లు పూర్తి చేసి మరమ్మతులు పూర్తి చేయడం ఈ రెండు మాసాల వ్యవధిలోపు సాధ్యమవుతుందా అన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. ఇది పూర్తవకపోతే ఎక్కడ స్నాతకోత్సవం నిర్వహిస్తారన్నది కూడా చూడాల్సి ఉంది. శాస్త్ర సాంకేతిక విజ్ఞానాన్ని అందించే విశ్వవిద్యాలయంలోనే ఒక ప్రతిష్టాత్మక భవన నిర్మాణం ఈ రకంగా తక్కువ సమయంలో దెబ్బతినడం విమర్శలకు తావిస్తోంది.

**టెండర్లు ఆహ్వానించాం**

**శశిధర్, రిజిస్ట్రారు,అనంతపురం జెఎన్‌టియు**

జెఎన్‌టియు ఆడిటోరియం మరమ్మతులకు రూ.54 లక్షలతో టెండర్లు ఆహ్వానించాం. త్వరితగతిన పనులు ప్రారంభం కానున్నాయి. సాధ్యమైనంత త్వరగా పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపడుతున్నాం.

## 544-డి రోడ్డు నిర్వాసితులకు

# న్యాయమైన పరిహారం చెల్లించాలి

## సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

పాముదాయి నుంచి తాడిపత్రి మండలం బుగ్గకోన వరకు నిర్మిస్తున్న 544-డి రోడ్డు నిర్వాసితులకు న్యాయమైన పరిహారం చెల్లించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.రాంభూపాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఏడు మండలాల మీదుగా వేస్తున్న జాతీయ రహదారి కోసం సుమారు 500 కుటుంబాలు ఇళ్లు, సాగు భూమి కోల్పోతున్నారని తెలిపారు. వీరికి 2019 నాటి భూమి విలువ ఆధారంగా పరిహారం చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించడం రైతులను దగా చేయడమే అవుతుందన్నారు. తొమ్మిది సంవత్సరాల క్రితం బుక్కరాయసముద్రం నుంచి తాడిపత్రి వరకు రోడ్డు వెడల్పు చేసిన సందర్భంగా సుమారు 450 ఇళ్లను తొలగించారని చెప్పారు. బుక్కరాయసముద్రం మండలంలోని రోటరీపురం, రెడ్డిపల్లి, కొర్రపాడు గ్రామాల్లో పరిహారం చెల్లించకుండా ఏడు సంవత్సరాలు ప్రజలను ఇబ్బందులు పెట్టారని తెలిపారు. ఈ గ్రామాల ప్రజలు అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్న రెండు సంవత్సరాలకే మళ్లీ రోడ్డు వెడల్పు పేరుతో తొలగించాలని అధికారులు మార్కింగ్ ఇవ్వడం దారుణమన్నారు. బాధిత కుటుంబాలకు నష్టం ఆధారంగా పరిహారం నిర్ణయించకుండా, అధికార పార్టీ నాయకుల ఆదేశాలకు అనుగుణంగా నిర్ణయించడం సరికాదన్నారు. ఇచ్చే పరిహారం కూడా 2013 భూ సేకరణ చట్టం ప్రకారం కాకుండా జాతీయ రహదారి నిబంధనల ప్రకారం చెల్లించాలనే నిర్ణయం సరికాదన్నారు. గ్రామసభలు జారపకుండా పరిహారం నిర్ణయించడాన్ని సిపిఎం, ఎపి.రైతుసంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తూ తహశీల్దార్, కలెక్టర్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టామన్నారు. దీనిపై స్పందించిన అధికారులు గత నెల 24వ తేదీన గ్రామసభలు జరిపారని తెలిపారు. అక్కడి నిర్వాసితులు కోరుతున్న మేరకు పరిహారం ప్రస్తుతం భూమి మార్కెట్ ధరలకు అనుగుణంగా ఇవ్వాలని, రాజకీయ జోక్యం లేకుండా నిష్పక్షపాతంగా బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ప్రజా సమస్యలను పరిష్కరించాం

## ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

'గడపగడపకూ' ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత

**ప్రజాశక్తి -అనంతపురం**

అనంతపురం అసెంబ్లీ నియోజకవర్గంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, ప్రజా సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించామని అర్బన్ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. బుధవారం నాడు నగరంలోని 5వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ముగించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. అనంతపురం నగర పాలక సంస్థ పరిధిలోని 74 వార్డు సచివాయాలతో పాటు నాలుగు పంచాయతీల్లోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేశామని చెప్పారు. గడపగడపకూ కార్యక్రమం ద్వారా దాదాపు 13 నెలల పాటు ప్రజలతో మమేకం అయ్యామని చెప్పారు. ఓ వైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూనే మరోవైపు స్థానిక సమస్యలకు పరిష్కార మార్గాలను చూపామన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించే ఏర్పాటు చేశామన్నారు. అర్హులకు పథకాలు రాకుంటే అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి వచ్చే ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రజలు కూడా ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిపై ప్రేమాభిమానాలు చూపారన్నారు. గడపగడపకూ కార్యక్రమం సిఎం తీసుకున్న సాహసోపేత నిర్ణయం అని తెలిపారు. ప్రజల సంక్షేమం, అనంతపురం నగర అభివద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో నాలుగేళ్లలో రూ.2200 కోట్లను సంక్షేమం కోసం వెచ్చించినట్లు చెప్పారు. రూ.650 కోట్లతో రోడ్లు, డ్రెయినేజీల అభివద్ధి పనులు చేపట్టామన్నారు. 23 వేల మందికి ఇంటి పట్టాలు అందిచామని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ జయలలిత, వైసీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నర్సింహయ్య, మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు వాసంతి సాహిత్య, కోగటం విజయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మన్ ఫయాజ్, వైసీపీ నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ గౌస్‌బేగ్, జేసీఎస్ కన్వీనర్లు ఆలమూరు శ్రీనివాసరెడ్డి, లక్ష్మన్న, వక్ఫ్‌బోర్డు జిల్లా ఛైర్మన్ కాగజ్‌ఘర్ రిజ్వాన్, బీసీ విభాగం రీజనల్ కో ఆర్డినేటర్ రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మట్టి తరలింపు చేస్తున్న ప్రాంతం ఇదే...

# బీకేఎస్‌లో మట్టి దోపిడీ..!

## ◆ పట్టపగలే యథేచ్ఛగా తరలింపు ◆ చోద్యం చూస్తున్న అధికారులు

**ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం**

బుక్కరాయసముద్రం మండల కేంద్రంలో మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. యథేచ్ఛగా ప్రభుత్వ స్థలాల్లో మట్టిని తరలించి లక్షలాది రూపాయలు సొమ్ము చేసుకుంటున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని అధికార పార్టీ నేతలే ఈ మట్టి దోపిడీకి పాల్పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా విన్పిస్తున్నాయి. బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన స్థలంలో ఇటీవల అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుని అనుచరుడు, లీజుదారుడు మట్టిని జెసిబిలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగానే ఈ మట్టి దోపిడీ జరుగుతున్నా రెవెన్యూ, సంబంధిత గిరిజన గురుకుల పాఠశాల అధికారులు మౌనంగా ఉండడం పలు అనుమానాలకు తావిస్తోంది. బుక్కరాయసముద్రం మండల కేంద్రం సర్వే నంబరు 396-7 సమీపాన గిరిజన సంక్షేమ శాఖకు చెందిన గురుకుల పాఠశాల నిర్మాణానికి 5 ఎకరాలకు పైగా స్థలాన్ని ప్రభుత్వం కేటాయించి స్వాధీనం చేసింది. ప్రభుత్వం నిధులు సకాలంలో ఇవ్వకపోవడంతో ఈ స్థలంలో నిర్మాణ పనులు మొదలు కాలేదు. ఇదే అదునుగా అధికార పార్టీకి చెందిన ముఖ్య నాయకుని అనుచరుడుగా ఉన్న వ్యక్తి గ్రావెల్ కోసం స్కూల్ స్థలంకు ఎసరు పెట్టేందుకు పథకం రచించారు. మట్టి తరలించేందుకు అనుమతులు పేరుతో గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల కోసం కేటాయించిన స్థలంలో పట్టపగలే తన సొంత జెసిబితో మట్టిని తవ్వి అమ్మకాలు చేస్తున్నాడు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతి పొందిన స్థలంలో కాకుండా గిరిజన గురుకుల పాఠశాలకు సంబంధించిన స్థలంలో మట్టిని తవ్వుతూ అక్రమంగా తరలిస్తున్నా అధికారులు నోరుమెదపడం లేదు. ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించిన స్థలాలను నాశనం చేసి ఇలా మట్టి తరలించుకుపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. బుక్కరాయసముద్రం గ్రామంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయని, వాటిని రక్షించేలా బోర్డులు ఏర్పాటు చేయాలంటూ తరచూ పత్రికల్లో కథనాలు వస్తున్నా, ప్రజాసంఘాల నేతలు ఫిర్యాదులు చేస్తున్నా అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారన్న దానిపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా మండల రెవెన్యూ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు స్పందించి వారి స్థలం జరుగుతున్న అక్రమ మట్టి రవాణాని నియంత్రించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

# వాలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

## 14న తోపుదుర్తి సహకార డెయిరీ ప్రారంభం

## ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**ప్రజాశక్తి-ఆత్మకూరు**

వైసిపి అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి ప్రవేశపెట్టిన వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం నాడు ఆత్మకూరులో నిర్వహించిన వాలంటీర్లకు వందనం కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా విపత్తును ఎదుర్కోవడంలో వాలంటీర్ల పాత్ర ఆమోఘమని కొనియాడారు. వాలంటీర్ల ద్వారా అన్ని సంక్షేమ పథకాలకు ఇంటింటికీ అందుతున్నాయని తెలియజేశారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాడు అపద్దాలు, మోసపు మాటలతో ప్రజల్ని మోసం చేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల కుటుంబం 25 ఏళ్లు అధికారంలో ఉండి చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. కనీసం పేరూరు డ్యాంకు నీరు తేలేకపోయారని ఎద్దేవా చేశారు. మహిళా పాడి రైతుల కోసం తోపుదుర్తి సహకార డెయిరీని ఏర్పాటు చేశామని, ఈనెల 14న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో దీనిని ప్రారంభిస్తామని చెప్పారు. ఆత్మకూరు మండలంలో ఎక్కువమంది పేదలకు ఇళ్లు మంజూరు చేయించి, నిర్మాణాలు పూర్తి చేయించే వాలంటీర్లకు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి కారును నజరానాగా ప్రకటించారు. ఇళ్ల మంజూరుకు సంబంధించి సచివాలయం పరిధిలో టాప్‌గా నిలిచిన వాలంటీరుకు రూ.50 వేలు, రెండోస్థానంలో నిలిచిన వాలంటీరుకు రూ.30 వేలు, మూడోస్థానంలో నిలిచిన వాలంటీరుకు రూ.20 వేలు ప్రోత్సహక బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. అనంతరం పంపనూరులో ఉచిత బోర్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

వాలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి

# ప్రజల్లోకి శాస్త్రీయ ఆలోచనలు

## జెవివిలో సభ్యులుగా చేరండి - మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్

పోస్టర్లు విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ డా॥గేయానంద్

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

సైన్స్ పట్ల ఆసక్తి ఉన్న వారందరూ ప్రజల్లోకి శాస్త్రీయ ఆలోచనలు తీసుకెళ్లేందుకు జన విజ్ఞాన వేదికలో సభ్యులుగా చేరాలని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ పిలుపునిచ్చారు. బుధవారం ఆర్ట్స్ కాలేజీలో ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డితో కలిసి జెవివి సభ్యత్వం పోస్టర్‌లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం, జిల్లాలో జెవివి సభ్యత్వ క్యాంపెయిన్ జరుగుతోందని చెప్పారు. ప్రజలకు సైన్స్‌ను చెప్పే ఒకేఒక వేదికగా జనవిజ్ఞాన వేదిక నిలిచిందన్నారు. రాబోయే కాలంలో కాలేజీ విద్యార్థుల కోసం జన విజ్ఞాన వేదిక అనేక కార్యక్రమాలను చేపట్టబోతోందని తెలిపారు. విద్యార్థులు జన విజ్ఞాన వేదిక సభ్యులుగా చేరాలని కోరారు. విశ్వం ఆవిర్భావం, జీవి పుట్టుక, మానవ పరిణామం, సమాజ పరిణామం, సైన్స్‌లో తాజా ఆవిష్కరణలు. ఈ అంశాలపై సైన్సు క్లాసులను జన విజ్ఞాన వేదిక విద్యార్థులకు విస్తతంగా నిర్వహించనుందని తెలియజేశారు. ఆసక్తి ఉన్నవారు ఎవరైనా, ఈ క్లాసులలో పాల్గొనవచ్చని తెలిపారు. గ్రామాలలో వ్యాప్తి చెందే మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సైన్స్ ప్రచారం చేయాలనుకునే యువతీ యువకులు జనవిజ్ఞాన వేదికలో చేరాలని కోరారు. ఆర్ట్స్ కాలేజ్ ప్రిన్సిపల్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ భావాల ప్రచారంలో విద్యార్థుల భాగస్వామ్యం అవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముత్యాలు, గాంగే నాయక్, జిల్లా కోశాధికారి రామిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వమే పత్తి విత్తనాలు సరఫరా చేయాలి : రైతుసంఘం

**ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్**

జిల్లాలోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా పత్తి విత్తనాలు సరఫరా చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వి.శివారెడ్డి, బిహెచ్.రాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఉమా మహేశ్వరమ్మను బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో తాడిపత్రి, పామిడి, పెద్దవడుగూరు, గుత్తి, గుంతకల్, యాడికి, పుట్లూరు మండలాల్లో రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని కొన్ని కంపెనీలు, ఫర్టిలైజర్స్ షాపు యజమానులు కల్తీ, నాశిరకం పత్తి విత్తనాలను ఇచ్చారన్నారు. వ్యవసాయ శాఖ బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన కొన్ని కంపెనీల విత్తనాలనూ సరఫరా చేశారన్నారు. దీంతో దిగుబడి రాక రైతులు కోట్లాది రూపాయలు పెట్టుబడులు నష్టపోవాల్సి వచ్చిందన్నారు. ఇలాంటి వాటిని నివారించేందుకు ప్రభుత్వమే పత్తి విత్తనాలు సరఫరా చేయాలన్నారు.

## నేడు నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు షోరూం ప్రారంభం

**అనంతపురం** : అనంతపురం నగరంలోని న్యూ మున్సిపల్ కాంప్లెక్స్ షాప్ నెంబర్-55లో నూతనంగా నిర్మించిన నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు షోరూమ్‌ను గురువారం నాడు లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు, ప్రొప్రైటర్ అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఏపీ శాప్ ఛైర్మన్, స్టేట్ యూత్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి, ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి, యాదవ్ కార్పొరేషన్ ఛైర్మన్ హరీష్ కుమార్ యాదవ్, ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెలిపారు. నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు వ్యవస్థాపకులు, జబర్దస్త్ ఫేమ్ కిరాక్ ఆర్‌పి కూడా హాజరవుతున్నట్లు తెలిపారు. అనంత ప్రజలకు అదిరిపోయే చేపల పులుసు అందించేందుకు తాము ముందుకొచ్చినట్టు తెలిపారు. ప్రజలకు చేపల వంటకాలను పరిచయం చేసే క్రమంలో రవ్వ చేపల పులుసు, సన్న చేపల పులుసు, కొరమీను పులుసు, చేప తలకాయ పులుసు, పప్పు చారు, ఉప్పు చేప వంటి వంటకాలతో పాటు ప్రత్యేకంగా ఒక కేజీ మాంసం కలిగిన చేపల పులుసును కుండలో అందిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటుగా రాగి సంగటి, వైట్ రైస్, కొర్రలు, రైస్ బ్రాండ్, రైస్ వంటకాలను అందిస్తున్నట్లు తెలిపారు. నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు యాజమాన్యం అన్ని విషయాల్లో రాజీ పడకుండా నాణ్యతతో వంటకాలను అందిస్తున్నట్లు తెలిపారు. మరో రెండు రోజుల్లో రుద్రంపేటలో మరో బ్రాంచ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపల పులుసు వంటకాలను అద్భుతమైన రుచులలో అందించేందుకు ముందుకు వచ్చిన తమను అనంత ప్రజలు ఆదరించాలని కోరారు

# విత్తన వేరుశనగను వంద శాతం పంపిణీ చేస్తాం

### జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ

**ప్రజాశక్తి-ఉరవకొండ**

జిల్లాలోని రైతులందరికీ వంద శాతం విత్తన వేరుశనగ పంపిణీ చేయడమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మండ ల పరిధిలోని చిన్నముష్టూరు, ఆమిద్యాల గ్రామాలతో పాటు విడపనకల్లు మండల పరిధిలోని చీకలగురికి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను బుధవారం ఉరవకొండ ఆమె ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజతో కలిసి సందర్శించి రికార్డులను పరిశీలించి సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 2.5 లక్షల హెక్టార్లలో వేరుశనగ పట సాగయ్యే అవకాశం ఉందన్నారు. ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో విత్తన వేరుశనగ పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. డివిజన్, మండల స్థాయి వ్యవసాయ అధికారుల సహకారంతో గ్రామస్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తున్నారని సం తృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో వ్యవసాయ అధికారులు ఎదుర్కొంటున్న టెక్నికల్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. విడపనకల్లు మండలానికి 1000 క్వింటాళ్లు కేటాయించగా 493 క్వింటాళ్లు రైతు భరోసా కేంద్రాలకు సరఫరా చేసినట్లు పేర్కొన్నారు. 272 మంది రైతులకు 245 క్వింటాళ్లు పంపిణీ చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అనంతరం వారు చీకలగురికి గ్రామంలో రైతులకు విత్తన వేరుశనగను పంపిణీ చేశారు. కార్యక్రమంలో విడపనకల్లు, ఉరవకొండ వ్యవసాయ అధికారులు పెన్నయ్య, శుభకర్, గ్రామ వ్యవసాయ అధికారులు లక్ష్మణ్, భీమేష్, మీనాక్షి, రైతులు పాల్గొన్నారు.

విత్తన వేరుశనగను పంపిణీ చేస్తున్న జెడిఎ ఉమామహేశ్వరమ్మ

## మరమ్మతులకు నోచుకోని సాగునీటి కాలువలు

ప్రధాన సాగునీటి కాలువలలో ఏపుగా పెరిగిన కంపచెట్లు

**బొమ్మనహాల్ :** మండల పరిధిలోని తుంగభద్ర ఆయకట్టు భూములకు వెళ్లే సాగునీటి కాలువలను ఉపాధి హామీ చట్టం కింద మరమ్మతులు చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలో 18 వేల ఎకరాలకు 9 డిస్ట్రిబ్యూటర్ల నుంచి సాగునీరు అందుతుంది. అయితే కాలువల్లో పిచ్చి మొక్కలు, కంపచెట్లు, గడ్డి ఏపుగా పెరిగి అడ్డుగా ఉండడంతో పంట పొలాలకు సక్రమంగా నీరందడం లేదు. ఆయకట్టుకు వెళ్లే చిన్న డిస్ట్రిబ్యూటర్లు, కాలువలకు మరమ్మతులు చేస్తే ఆయకట్టుకు సకాలంలో నీరు చేరుతుందని రైతులు పేర్కొంటున్నారు. రైతు ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఉపాధి హామీ చట్టం కింద కాలువల మరమ్మతులు చేయాలని కోరుతున్నారు. ఈ విషయమై ఏఈఈ షకీలా బేగంను వివరణ కోరగా రైతుల విజ్ఞప్తిని పరిశీలించి అమలు చేయడానికి ప్రయత్నం చేస్తామని తెలిపారు.

### జెడిఎకు వినతి

**ఉరవకొండ :** జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మను బుధవారం విడపనకల్లు సహకార సంఘం సొసైటీ ఛైర్మన్ బోయ శ్రీరాములు స్థానిక ఎడిఎ కార్యాలయంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ విడపనకల్లు మండలంలోని రైతులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. మండల వ్యాప్తంగా రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారని, వారికి అవసరమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో సరఫరా చేయాలని కోరారు. అనంతరం ఉమామహేశ్వరమ్మకు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ ఎడిఎ పద్మజ, విడపనకల్లు సొసైటీ సీఈఓ ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# అండర్ డ్రైయినేజీ పునరుద్ధరణ పనులు చేపట్టాలి

### వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్ రెడ్డి

**ప్రజాశక్తి-తాడిపత్రి**

పురపాలక సంఘం పరిధిలోని అండర్ డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా గాడి తప్పి మురుగునీరు రోడ్లపైకి పొంగిపొర్లడంతో దుర్వాసన వెదజల్లుతూ కంపు కొడుతోందని వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఇకనైనా మున్సిపల్ శాఖ అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే అండర్ డ్రైనేజీ వ్యవస్థ పునరుద్ధరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట స్థానికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాడిపత్రి పురపాలక సంఘంలో ఏ ఒక్క పని జరగకపోతే ప్రజలకు ఏం సమాధానం చెప్పాలి.. రోడ్లపై ఎలా తిరగాలి అని మున్సిపల్ అధికారులను నిలదీశారు. పుర పాలక సంఘం మొత్తం మురికినీటి కంపులా తయారైనా పట్టించుకునేవారే కరువయ్యారని మండిపడ్డారు. సమస్యను పరిష్కరించకపోతే పురపాలక సంఘం కార్యాలయం ముందు వంటావార్పు నిరసన కార్యక్రమం చేపడతానని హెచ్చరించారు. ఈ ధర్నాకు టిడిపి కౌన్సిలర్లు మల్లిఖార్జున, షెక్షావలి సంపూర్ణ మద్దతు తెలిపారురు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తి ఏ పార్టీ అయినా అతని వెంట నడుస్తాం.. ధర్నాలో భైఠాయిస్తాం అని తెలిపారు. వైసిపి పాలనలో పురపాలక సంఘం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

ధర్నాలో మాట్లాడుతున్న వైసిపి రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి, ఓబుళరెడ్డి

## గుంతకల్లు మున్సిపల్ కమిషనర్‌గా వి.మల్లికార్జున

**గుంతకల్లు :** మున్సిపల్ శాఖ నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా ధర్మవరం మున్సిపాలిటీ నుంచి గుంతకల్లు మున్సిపాలిటీకి బదిలీపై వచ్చిన నూతన కమిషనర్ వి.మల్లికార్జున బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన బండి శేషన్న ధర్మవరం వెళ్లారు. మల్లికార్జున ముందుగా కసాపురం వెళ్లి నెట్టికంటి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని, మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎన్.భవానిని, వైస్ ఛైర్‌పర్సన్ నైరుతి రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బాధ్యతలు చేపట్టిన ఆయనకు మున్సిపల్ అధికారు లు, సిబ్బంది సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా కమిషనర్ విలేకరులతో మాట్లా డుతూ ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది సహకారంతో పట్టణ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## వైఎస్ఆర్ బీమాను ఉపయోగించుకోవాలి

**నార్పల :** ప్రతి ఒక్కరూ వైఎస్ఆర్ బీమాతో పాటు ఇతర ప్రభుత్వ పథకాలను తప్పకుండా ఉపయోగించుకునేలా చూడాలని ఈఓఆర్‌డి లక్ష్మీనరసింహ సూచించారు. మండల పరిధిలోని బండ్లపల్లి, బి.పప్పూరు గ్రామ సచివాలయాలను బుధవారం ఈఓఆర్‌డి సందర్శించి సిబ్బంది హాజరును రికార్డులను పరిశీలించారు. అలాగే సచివాలయం ద్వారా అందిస్తున్న సేవలు, ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. అనం తరం బండ్లపల్లిలోని ఘన వ్యర్థ పదార్థాల సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి చెత్త సేకరణ ఇంకా బాగా జరగాలని వర్మీ కంపోస్టును అమ్మి ఆ సొమ్మును గ్రామ పంచాయతీ ఆదాయంలో జమ చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచి వెంకటనారాయణమ్మ, పంచాయతీ కార్యదర్శులు రఘునాథ్ రెడ్డి, సూర్య, కళావతి, సిబ్బంది కుళ్లాయప్ప, రామచంద్ర, జగదీష్, చాణక్య, అమర, పుల్లయ్య, ప్రతాపరెడ్డి, భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మరోచోట స్థలం కేటాయిస్తాం

**కుందుర్పి :** వికలాంగుల భవనం కోసం 8 ఏళ్ల క్రితం కేటాయించిన 10 సెంట్ల స్థలం విషయంలో అధికారుల నిర్లక్ష్య వైఖరిని ఖండిస్తూ వికలాంగులు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు 8 రోజులుగా ధర్నా చేపట్టారు. దీంతో కళ్యాణదుర్గం ఆర్డీవో నిశాంత్‌రెడ్డి బుధవారం ఆ స్థలాన్ని పరిశీలించి వికలాంగులతో చర్చించారు. దీనిపై ఆర్డీవో మాట్లాడుతూ వికలాంగులు కోరుతున్న స్థలం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉందని కావున దానికి సమీపంలో స్థలాన్ని కేటాయించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అయితే తమ స్థలం తమకు ఇప్పించేంత వరకూ తహశీల్దార్ కార్యాలయం ముందు నిరాహార దీక్ష చేపడతామని వికలాంగులు హెచ్చరించారు.

## విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటాలు

### రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ

**ప్రజాశక్తి-రాయదుర్గం**

ఎస్ఎఫ్ఐ బలోపేతం, ప్రభుత్వ విద్య పరిరక్షణ, విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ సభ్యులు బంగి శివ తెలిపారు. ఈ నెల 5,6 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్లీనరీ సమావేశాల్లో ఆల్ ఇండియా అధ్యక్షులు విపి సాను, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసన్న, అశోక్ ఆధ్వర్యంలో రాయదుర్గం పట్టణానికి చెందిన బంగి శివను రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐలో కార్యకర్త స్థాయి నుంచి రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎదిగేందుకు సహకరించిన సిపిఎం జిల్లా కార్యదర్శికి, ఎస్ఎఫ్ ఐ జిల్లా నాయకత్వానికి, రాయదుర్గం పట్టణ సిపిఎం నాయకత్వానికి ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నాలుగేళ్ల హానర్స్ డిగ్రీని ప్రవేశపెట్టి పేద మధ్య తరగతి విద్యార్థులకు చదువును దూరం చేయాలనే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. 77 జీవో ద్వారా పీజీ విద్యార్థులకు రీయింబర్స్‌మెంట్ రద్దవుతోందని, దానిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే రాయదుర్గం పట్టణంలోని ప్రయివేట్ విద్యాసంస్థలు అనుసరిస్తున్న విద్యా విధానాలకు వ్యతిరేకంగా రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

## బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

**పెద్దపప్పూరు :** మండల పరిధిలోని జూటూరు గ్రామం అంగన్వాడీ కేంద్రంలో బుధవారం బాల్య వివా హాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కళ్యాణ్ కుమార్ మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలతో పాటు రక్తహీనత, పిల్లల్లో ఎదుగుదల ఉండదన్నారు. మీ పిల్లల భవిష్యత్తును మీరే నరక కూపంలోకి వేసినట్లు అవుతుందన్నారు. ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు తిప్పిరమ్మ, గిరిజ బాల్య వివాహం చేయడం వల్ల చిన్నతనంలోనే పిల్లలు పుడితే వారిలో పెరుగుదల ఉండదని, కుటుంబ పోషణ భారమై వారి బతుకులు చిన్నాభిన్నం అవుతాయన్నారు. అలాగే పలు రకాల సమస్యలు ఎదు ర్కోవాల్సి వస్తుందని, కావున ఆడపిల్లకు 20 సంవత్సరాలు వచ్చిన తర్వాతే పెళ్లి చేయాలన్నా రు. అప్పుడే వారికి అవగాహన ఉండి తమ పిల్లల భవిష్యత్తుకు మంచి పునాది వేస్తారని వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ దస్తగిరమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## లింగనిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన

**ఉరవకొండ :** మండల పరిధిలోని రాకెట్ల పిహెచ్‌సి సిబ్బంది ఆధ్వర్యంలో బుధవారం మోపిడి గ్రామంలో లింగ నిర్ధారణ నిరోధక చట్టంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ మాట్లాడుతూ ఆడపిల్లల కంటే మగ పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో జిల్లా వైద్యాధికారుల ఆదేశాలతో మోపిడి గ్రామంపై ప్రత్యేక దృష్టి సారించి 3 నెలల పాటు వరుసగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. గర్భిణులు, కిశోర బాలికలకు లింగ సమానత్వంపై అవగాహన కల్పించారు. ఆడపిల్లలకు అన్ని రంగాల్లో ప్రత్యేక అవకాశాలు ఉన్నాయని వాటిని వినియోగించుకోవాలని కోరారు. అబార్షన్ నేరమని, దాని వల్ల ప్రాణాలకి ముప్పు అని హెచ్చరించారు. భ్రూణహత్యలకు పాల్పడరాదని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శేఖర్, ఎంఎల్‌హెచ్‌పి ప్రియ, ఏఎన్ఎం అనూష, సీఓ భగవాన్ దాస్, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలను పెంచండి

**పుట్లూరు:** మండలంలో విరివిగా ఉపాధి పనులు కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఏపీవో చెన్నకేశవులు ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపిపా మాట్లాడుతూ ఉపాధి హామీ పనులకు మండలంలోని అన్ని పంచాయతీల నుంచి కూలీలు వచ్చేలా చూడాలన్నారు. ప్రతిరోజూ 2000 మందికి పైగా రావాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ప్రతిరోజూ పని ప్రదేశం నుంచి రెండు ఫొటోలు తప్పనిసరిగా పంపాలన్నారు. కార్యక్రమంలో టిఏలు, ఎఫ్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదంలో సిఎస్‌డిటి మృతి

### భార్య, కుమారుడు, డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ప్రమాదంలో మృతిచెందిన కరుణాకర్

**పెద్దవడుగూరు :** మండల పరిధిలోని మిడుతూరు వద్ద 44వ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో సిఎస్‌డిటి కరుణాకర్(52) మృతి చెందగా ఆయన భార్య, కుమారుడు తీవ్రం గా గాయపడ్డారు. ఎస్ఐ శ్రీనివాసులు తెలిపిన వివరాల మేరకు.. శ్రీసత్య సాయి జిల్లా అమరాపురం మండల రెవెన్యూ కార్యాలయంలో పౌరసఫరాల ఉప తహశీల్దార్(సిఎస్‌డిటి)గా పని చేస్తున్న కరుణాకర్ తనకు వైద్యం చేయించుకునేందుకు భార్య వరలక్ష్మి, కొడుకు సాయితో కలిసి కారులో కర్నూలులోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి వెళ్లారు. తిరిగి వెళ్తుండగా మిడుతూరు వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కరుణాకర్ అక్కడికక్కడే మృతి చెందగా భార్య, కుమారుడు, డ్రైవర్‌కు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## నేరాలు ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

**బుక్కరాయసముద్రం,శింగనమల:** రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందిన సంఘటన బుధవారం మండల పరిధిలోని వడియంపేట మలుపు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శింగనమల మండలంలోని నాగలగుడ్డం గ్రామనికి చెందిన లక్ష్మీనారాయణ, శిల్ప దంపతులు బుధవారం ద్విచక్ర వాహనంపై అనంతపురం బయల్దేరారు. వారు వడియంపేట వద్ద వెళ్తుండగా మలుపులో లారీ ఢీకొనడంతో శిల్ప అక్కడికక్కడే మృతి చెందగా లక్ష్మీనారాయణ గాయపడ్డాడి. విషయం తెలిసిన వెంటనే బుక్కరాయసముద్రం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అలాగే కేసు నమోదు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలి పారు. వారికి నాలుగు నెలల క్రితం వివాహమైనట్లు సమాచారం. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే టిడిపి అధికార ప్రతినిధి డేగల కృష్ణమూర్తి అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శిల్ప కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, ప్రమాదంలో గాయపడిన లక్ష్మీనారాయణకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# ప్రజలపై మోయలేని విద్యుత్ భారాలు

### అప్పర్ భద్రతో రాయలసీమ ఎడారి :సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

**ప్రజాశక్తి-గుంతకల్లు**

రాష్ట్రంలో విద్యుత్ వినియోగదారులపై పదేపదే జగన్ మోహన్ రెడ్డి భరించలేని ఛార్జీల భారాలు మోపుతున్నారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. బుధవారం నాడు గుంతకల్లు సిపిఐ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒకేసారి జూన్ నెలలో మూడుసార్లు స్లాబ్ ఆఫ్ ఛార్జీలు పెంచడం, తిరిగి తోడు ట్రూఅప్ ఛార్జీల మీటర్లు బిగిస్తామని ఆ భారం వినియోగ దారులపై వేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అదాని, అంబానీలకు లాభాలు చేకూర్చేందుకు కోట్లాది రూపాయల కమీషన్లకు కక్కుర్తితో ముఖ్యమంత్రి ప్రజలపై భారాలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో త్వరలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని చెప్పారు. పోలవరం ప్రాజెక్టు 2020 డిసెంబర్‌కు పూర్తి చేసి కాలువలకు నీరు అందిస్తామని అసెంబ్లీలోనే చెప్పిన సిఎం జగన్ రెడ్డి మాట తప్పాడన్నారు. ప్రజల్ని మభ్యపెట్టేందుకు ఇపుడు పోలవరం ప్రాజెక్టును సందర్శించండం సిగ్గు చేటన్నారు. అప్పర్ భద్ర, నావలి రెండు అక్రమ ప్రాజెక్టులను కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నా ముఖ్యమంత్రిలో చలనం లేదన్నారు. అప్పర్‌భద్ర నిర్మాణం జరిగితే రాయలసీమ ఎడారి ప్రాంతంగా మారుతుందని చెప్పారు. దీనిని నిరసిస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీ నుంచి 20వ తేదీ వరకు రైతు గర్జన ప్రచార జాతాను 32 మండలాల్లో నిర్వహిస్తున్నామన్నారు. 21న అనంతపురం కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్, బి.గోవిందు, వీరభద్ర స్వామి పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న కె.రామకృష్ణ

# కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలి

### సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య

**ప్రజాశక్తి-ఉరవకొండ**

కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న విజయవాడ నుంచి మంగళగిరి వరకు చేపట్టిన పాదయాత్రను విజయవంతం చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగారెడ్డి, బాల రంగయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విడపనకల్లు మండల పరిధిలోని పాల్తూరు గ్రామంలో కౌలు రైతుల సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 30 లక్షల కుటుంబాలకు పైగా ఉన్న కౌలు రైతులకు ఇబ్బంది లేకుండా గుర్తింపు కార్డు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో జూన్ 5 నుంచి 10వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రచారజాతాలు, సచివాలయాలు, తహశీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళనలు చేపట్టి వినతిపత్రాలు ఇస్తామన్నారు. అలాగే ఈ నెల 12న విజయవాడ నుంచి ప్రకాశం బ్యారేజీ మీదుగా మంగళగిరి సిసిఎల్ఏ కార్యాలయం వరకూ పాదయాత్ర చేపడతామని అందులో కౌలు రైతులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ఉండబండ, పాల్తూరు, హావలిగి, కరకముక్కల సచివాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అలాగే ఈదురు గాలుల ధాటికి విద్యుత్ స్తంభాలు పడిపోవడం వల్ల పాల్తూరులో వారం రోజులు గా తాగునీటి సమస్యతో పాటు వేరుశనగ పంట ఎండిపోతుందన్నారు. వెంటనే విద్యుత్ సర్వీసులను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మిరప, పత్తి విత్తనాలను సబ్సిడీ ధరతో రైతు భరోసా కేంద్రాల్లో ఇవ్వాలన్నారు. అనంతరం కౌలు రైతుల పాదయాత్ర కరపత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రవి ప్రకాష్, వన్నూరుస్వామి, కార్యవర్గ సభ్యులు నాగరాజు, బంగారప్ప, క్రిష్టప్ప, కౌలు రైతులు పాల్గొన్నారు.

ఉండబండలో పంచాయతీ సెక్రెటరీకి వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు

## విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

**ప్రజాశక్తి-ఉరవకొండ**

పడిపోయిన విద్యుత్ స్తంభాలను చూపిస్తున్న రైతులు

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించకపోతే ఆత్మహత్యలే శరణ్యమని విడపనకల్లు మండల పరిధిలోని చీకలగురికి గ్రామానికి చెందిన రైతులు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రైతులు వారి పొలాల్లో పడిపోయిన విద్యుత్ స్తంభాలను చూపిస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ పది రోజుల క్రితం ఈదురుగాలుల ధాటికి గ్రామ సమీపంలోని గుర్రం వెంకన్న లైన్‌లో 6, డోన్ చెరువు దగ్గర 3, రామాంజనేయులు విద్యుత్ లైన్ దగ్గర 4 స్తంభాలు నెలకొరిగాయన్నారు. దీంతో అప్పటి నుంచి సరఫరా ఆగిపోవడంతో గ్రామంలో దాదాపు 700 ఎకరాల్లో బోరు బావుల కింద సాగు చేసిన వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిందన్నారు. విత్తనం వేసి 40 రోజులు అయిందని ఎకరాకు రూ. 50 వేలు పెట్టుబడి పెట్టామని అయితే విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ విషయంపై లైన్‌మేన్‌తో పాటు మండల ఏఈని సంప్రదించినా ఫలితం లేదని వాపోయారు. వీలైనంత తొందరగా సమస్యను పరిష్కరించకపోతే విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ముట్టడి స్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామంలోని సచివాలయం ఎదుట ఆందోళన చేపట్టి సచివాలయ సిబ్బందికి వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో రైతులు కె.విజయభాస్కర్, వన్నూరు స్వామి, మల్లన్న, ఎర్రిస్వామి, లింగన్న, సిద్ధప్ప, జయరాములు, చెన్నయ్య, ముత్తు ముని, రమేష్, రామాంజనేయులు, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

## పంటల సాగుపై అవగాహన

**పెద్దవడుగూరు:** మహిళా రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం హెచ్‌హెచ్ఎఐ ప్రాజెక్టులో భాగంగా బుధవారం మండల పరిధిలోని లక్ష్మంపల్లి గ్రామంలో వివిధ రకాల పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ ట్రైనర్ లక్ష్మీదేవి, రజియా బేగం పెరటి తోటల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. అలాగే చిరుధాన్యాల ప్రాముఖ్యత గురించి వివరిం చారు. ఖరీఫ్ సీజన్‌లో అంతర్ పంటలు, చిరుధాన్యాలు పండించేలా అవగాహన కల్పించారు. మనం ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. ముఖ్యంగా విటమిన్స్, పిండి, కొవ్వు పదార్థాలు, మాంసకృత్తులు, ఖనిజ లవణాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం కిచెన్ గార్డెన్ కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి, సచివాలయ సిబ్బంది, మహిళా రైతులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

రికార్డులను పరిశీలిస్తున్న నోడల్ ఫ్యామిలీ డాక్టర్ సుజాత

## ప్రజలకు అందుబాటులో ఉండాలి

**ప్రజాశక్తి-గార్లదిన్నె**

వైఎస్ఆర్ విలేజ్ హెల్త్ సెంటర్లలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని జిల్లా ఫ్యామిలీ డాక్టర్ నోడల్ అధికారి డాక్టర్ సుజాత సిబ్బందికి సూచించారు. మండల పరిధిలోని కల్లూరు గ్రామంలో ఉన్న వైఎస్సార్ విలేజ్ హెల్త్ సెంటర్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహణ, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజలు, గర్భిణులకు అందిస్తున్న సేవలు, రక్త పరీక్షలపై ఆరా తీశారు. అలాగు సేవలు ఎలా అందుతున్నాయని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలో మంచానికి పరితమైన వారిని గుర్తించి అవసరమైన ఆరోగ్య సేవలు అందించా లని, స్కూల్స్, అంగన్వాడీ సెంటర్స్‌ను సందర్శించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ గౌతమి, డాక్టర్ కృతి, 104 నిర్వహణ అధికారి కృష్ణమూర్తి, ఎంఎల్‌హెచ్‌పి మధులత, ఎఎన్ఎం నాగేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ శివయ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## డయేరియాను నివారిద్దాం

**ఉరవకొండ :** అతిసార(డయేరియా) నివారణకు కలిసికట్టుగా పనిచేయాలని విడపనకల్లు ఎంపిపి కరణం పుష్పవతి భీమ్‌రెడ్డి సూచించారు. విడపనకల్లు మండల పరిధిలోని గడేకల్ ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉధత అతిసార నివారణ పక్షోత్సవాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపిపి మాట్లాడుతూ సాధారణంగా ఐదుళ్ల లోపు పిల్లల్లో వచ్చే ప్రమాదకరమైన రోగాల్లో అతిసార ఒకటన్నారు. చిన్నపిల్లలు వర్షాకాలంలో ఎక్కు వగా ఈ వ్యాధికి గురవుతారన్నారు. అనంతరం అతిసార నివారణ పోస్టర్లను ఆవిష్కరించారు. అలాగే ఓఆర్ఎస్ ప్యాకెట్లను పిల్లల తలలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి సుశీల ఉమాశంకర్, ఎంపిటిసి ఓబులేసు, వైసిపి నాయకులు కరణం భీమిరెడ్డి, వైద్య సిబ్బంది సుగుణ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఉమారాణి, మహిళా పోలీస్ అరుణకుమారి, అంగన్వాడీ కార్యకర్తలు విజయ, నిర్మల, రాజమ్మ, వనిత, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## జగనన్న పెళ్లికానుక అందజేత

**శింగనమల :** 'జగనన్న పెళ్లి కానుక' ద్వారా మంజూరైన రూ. లక్ష చెక్కున బుధవారం సింగిల్‌విండో ప్రెసిడెంట్ బొమ్మన శ్రీరామ్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. శింగనమలకు చెందిన రామాంజనమ్మ, శ్రీనివాసులు దంపతుల కుమార్తెకు 4 నెలల క్రితం వివాహమైంది. దీంతో వైఎస్ఆర్ జగనన్న పెళ్లి కానుక ద్వారా రామాంజనమ్మ బ్యాంకు ఖాతాలోకి నేరుగా రూ. లక్ష జమ అయింది. అనంతరం స్థానిక వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్‌రెడ్డి మాట్లాడుతూ శింగనమల చెరువు నీటిని సలకంచెరువు, ఈస్ట్ నరసాపురం పెద్ద కుంటకు ఏటా వదులుతామని తెలిపారు. గ్లోబలైజేషన్ చేయించిన ఘనత ఎమ్మెల్యే పద్మావతి దంపతులకే దక్కిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ జగనన్నే ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి యోగేశ్వరి, చెన్నకేశవులు, డీలర్ మల్లికార్జునరెడ్డి, పెద్దకోట్ల చెవిరెడ్డి, ఎన్‌వి నారాయణ, శివశం కర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, వెంకట్రాముడు, నవీన్, వైసిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాడు-నేడు పనుల పరిశీలన

**ఆత్మకూరు :** స్థానిక ఎస్సీ కాలనీలోని ఎంపిపి పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను బుధవారం అసిస్టెంట్ కలెక్టర్ ప్రశాంత్ కుమార్ పరిశీలించారు. పనులను పాఠశాల తెరిచేలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఇఒ నరసింహారెడ్డి, హెచ్ఎం గంగిరెడ్డి, సచివాలయ ఇంజనీర్ ఉన్నారు.

## విఆర్ఒలు బదిలీ రిలీవ్ చేయని అధికారులు

**బొమ్మనహాల్ :** సాధారణ బదిలీల్లో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఐదేళ్లు సర్వీసు పూర్తయిన విఆర్ఒలను బదిలీ చేశారు. వారిలో పర్వీన్ బాను కణేకల్లు మండలానికి, నేమకల్లు, ఏలంజిలో విధులు నిర్వహిస్తున్న వినయ్‌కుమార్‌రెడ్డి, బాలాజీనాయక్ డి.హీరేహాల్ మండలానికి, బండూరులో పని చేస్తున్న గోపాల్ కూడేరు మండలానికి బదిలీ అయ్యారు. వారి స్థానాల్లో కళ్యాణదుర్గం, రాయదుర్గం మండలాల నుంచి ఒకరు చొప్పున ఇక్కడికి బదిలీపై వచ్చినట్లు తహశీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. బదిలీ అయిన వారిని అధికారులు రిలీవ్ చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయమై తహశీల్దార్ శ్రీనివాసులును వివరణ కోరగా ఈ మండలం నుంచి ఐదుగురు బదిలీ కాగా ఇక్కడికి ఇద్దరే వస్తున్నారు. దీంతో వారిని రిలీవ్ చేయలేకపోయామని దాటవేశారు.

## అమృత్‌సరోవర్ పనుల పరిశీలన

**రాయదుర్గం రూరల్ :** మండల పరిధిలోని వేపరాల, టి.వీరాపురం పంచాయతీల్లో జరుగుతున్న అమృత్ సరోవర్ పనులను బుధవారం స్టేట్ టీం తనిఖీ చేసినట్లు ఏపీవో నీరజ తెలిపారు. కార్యక్రమంలో డిడి గ్రౌండ్ వాటర్ జయారామిరెడ్డి, హెచ్ఓ గౌసియా, సోషల్ ఆడిట్ డిఆర్‌పి కృష్ణ, ఎంపిడిఒ కొండయ్య, ఎపిడి జయకుమార్, జెఈ, టిఏలు, తదితరులు పాల్గొన్నారు.

**In the Court of the Prl. District Judge: Ananthapuramu**

**E.P.No.569/2022 in O.S.No.56/2016**

**Between:**
P.Lakshmi Narayana Reddy ...Petitioner/D.Hr
And
E.Govinda Reddy S/o Chinna Kullayappa, R/at Narasanayanakunta Village, Anantapuramu Rural Mandal. ...Respondant/J.Dr

**వేలం ప్రకటన**

అర్జీదారుడు తన డిక్రీ మొత్తము రాబట్టుకొను నిమిత్తం ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని పై తెలిపిన కోర్టులో వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 15-06-2023వ తేది ఉ॥10.30 గం॥లకు పై కోర్టులో హాజరై కోర్టు షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

**షెడ్యూలు:**

Property Situated within A.Narayanapuramu Village Polam and Panchayat within SRD of Anantapuramu Rural and RD of Anantapuramu.

**Item No:1**
Govt.Dry Sy.No.1-1, Extent A.C: 7-10 H.S. 2.875
**Item No:2**
Govt.Dry Sy.No.1-2, Extent A.C: 5-70 H.S. 2.310
**Item No:3**
Govt.Dry Sy.No.57-1, Extent A.C: 4-75 H.S. 1.924

| Amina Value: | D.Hr Value: |
|---|---|
| Item No:1 Rs.1,45,00,000/- | Rs.22,00,000/- |
| Item No:2 Rs.1,10,00,000/- | Rs.21,00,000/- |
| Item No:3 Rs. 98,00,000/- | Rs.15,00,000/- |

(By Order of the Court)

హెచ్.రామసుబ్రమణ్యం, అడ్వకేటు
అనంతపురం.